బై బై పారిస్

ముగిసిన విశ్వక్రీడా పండుగ

తర్వాతి గమ్యస్థానం లాస్ ఏంజెల్స్

సుమారు మూడు వారాలుగా ప్రపంచ క్రీడాభిమానులను ఉర్రూతలూగించిన పారిస్ ఒలింపిక్స్‌కు తెరపడింది. సరిగ్గా వందేండ్ల తర్వాత విశ్వక్రీడాపండుగకు ఆతిథ్యమిచ్చిన ఫ్యాషన్ నగరిలో జూలై 25న ప్రఖ్యాత సీన్ నదిలో ఆరంభమైన ఈ క్రీడలకు ఆదివారంతో శుభం కార్డు పడింది. పదివేలకు పైగా అథ్లెట్లు, 32 క్రీడలు, 329 క్రీడాంశాలతో 17 రోజుల పాటు క్రీడా ప్రపంచాన్ని మునివేళ్లపై కూర్చోబెట్టిన ఆటలు ఘనంగా ముగిశాయి. పతకాల పట్టికలో అగ్రస్థానం కోసం ఎప్పటిలాగే అమెరికా, చైనా 'టాప్' లేపగా పలు దేశాలు బోణీ కూడా కొట్టకుండానే రిక్తహస్తాలతో వెనుదిరిగాయి. 117 మంది భారీ బృందంతో పారిస్‌కు వెళ్లిన భారత్ ఈసారి 'రెండంకెల పతకాల' కలను నెరవేర్చుకోకుండానే స్వదేశానికి తిరుగు ప్రయాణమైంది. ఇక ఒలింపిక్స్‌లో తర్వాతి గమ్యస్థానం లాస్ ఏంజెల్స్. 2028లో ఈ నగరం విశ్వక్రీడలకు ఆతిథ్యమివ్వనుంది.

పారిస్: ఫ్యాషన్ నగరి పారిస్‌లో మూడు వారాలుగా క్రీడా లోకాన్ని అలరించిన విశ్వక్రీడా పండుగకు తెరపడింది. ఒలింపిక్స్ చరిత్రలో మునుపెన్నడూ లేనివిధంగా స్టేడియం లోపల కాకుండా ప్రఖ్యాత సీన్ నదిలో ఆరంభ వేడుకలతో మొదలైన ఈ క్రీడలు ఆదివారంతో ముగిశాయి. ఎన్నో సంచలనాలు, మరెన్నో అబ్బురపరిచే ప్రదర్శనలు, కొత్తగా నమోదైన రికార్డులు, త్రుటిలో చేజారిన పతకాలు, క్రీడాకారుల నాలుగేండ్ల కఠోర శ్రమకు ప్రత్యక్ష సాక్ష్యంగా నిలిచిన పారిస్.. ఆటలకు ఘనంగా వీడ్కోలు పలికింది. ఐరాస గుర్తించిన దేశాలన్నింటితో పాటు ఒలింపిక్ శరణార్థుల జట్టు (ఐవోసీ) నుంచి పాల్గొన్న 10,500 మంది క్రీడాకారులు తమ అత్యుత్తమ ప్రదర్శనలతో అభిమానులకు అసలైన మజాను అందించారు. ఆతిథ్య పారిస్‌లోని 'ఒలింపిక్ గ్రామం'లో వసతుల లేమి, సీన్ నదిలో ఆరంభ వేడుకలు, అక్కడి నీటి నాణ్యతపై అపోహలు, పోటీల ఆరంభానికి ముందే అల్లరి మూకల బెదిరింపు చేష్టలు, బరిలో నిలిచిన పలువురు అథ్లెట్ల 'జెండర్'పై వివాదం, భారత రెజ్లర్ వినేశ్ ఫోగాట్‌పై అనర్హత వేటు వంటి చర్చోపచర్చలకు ఒలింపిక్స్ కేంద్ర బిందువైంది. విజ్ఞాలన్నింటినీ దాటుకుని సాగిన పారిస్ ప్రయాణానికి ఆదివారంతో శుభం కార్డు పడింది. తదుపరి ఎడిషన్‌కు లాస్ ఏంజెల్స్ (అమెరికా) ఆతిథ్యమివ్వనుంది.

ఉందిలే మంచికాలం ముందుముందున!

పారిస్‌లో భారీ అంచనాలతో బరిలోకి దిగిన భారత్ మరోసారి ఆరు పతకాలతో 'సింగిల్ డిజిట్'కే పరిమితమైంది. అయితే ఆశించిన మెడల్స్ రాకున్నా మన క్రీడాకారుల ఆట మునపటి కంటే బాగా మెరుగుపడింది. షూటింగ్‌లో యువ సంచలనం మను భాకర్ ఒకే ఎడిషన్‌లో రెండు పతకాలు కొల్లగొట్టి చరిత్రాత్మక ప్రదర్శన చేసింది. సరబ్‌జ్యోత్ సింగ్, స్వప్నీల్ కుశాలె, అర్జున్ బబుతా వంటి యువ షూటర్లు భవిష్యత్‌పై ఆశలు రేపుతున్నారు. పతకాలు రాకున్నా ఆర్చరీలో మన విలుకాళ్లు గతం కంటే మెరుగైన ప్రదర్శనే కనబరిచారు. బ్యాడ్మింటన్, ఆర్చరీ, షూటింగ్, అథ్లెటిక్స్ వంటి పలు క్రీడాంశాల్లో భారత్ నాలుగో స్థానంలో నిలిచి మరో ఏడు పతకాలు సాధించే అవకాశాన్ని కోల్పోయింది. అవీ వచ్చుంటే పారిస్‌లో మన లక్ష్యం నెరవేరేదే! టేబుల్ టెన్నిస్‌లో ప్యాడ్లర్లు మనికా బాత్ర, హైదరాబాదీ అమ్మాయి ఆకుల శ్రీజ సైతం ఫర్వాలేదనిపించారు. ఇక నీరజ్ మరో స్వర్ణం తేకున్నా రజతంతో రికార్డులు సృష్టించాడు. హాకీలో వరుసగా రెండోసారి కాంస్యం గెలుచుకున్న భారత జట్టు ఒలింపిక్స్‌లో 52 ఏండ్ల తర్వాత ఆస్ట్రేలియాను ఓడించడం విశేషం. బాక్సింగ్, అథ్లెటిక్స్‌లో మాత్రం దేశానికి నిరాశజనక ప్రదర్శనలు వచ్చాయి. రెజ్లింగ్‌లో వినేశ్ ఫోగాట్ 'వంద గ్రాముల' బరువు దేశ క్రీడాభిమానులకు కలిచివేయగా యువ రెజ్లర్ అమన్ సెహ్రావత్ మాత్రం 'పట్టు' వీడలేదు.

మళ్లీ వాళ్లే..

గత కొన్నేండ్లుగా ప్రపంచంపై ఆధిపత్యం కోసం అమెరికాతో ఢీ అంటే ఢీ అంటున్న చైనా ఒలింపిక్స్‌లోనూ ఆ దేశానికి అసలు సిసలు పోటీనిచ్చింది. ఈ రెండు దేశాలూ అగ్రస్థానం కోసం చెమటోడ్చాయి. తలా 40 స్వర్ణాలతో సత్తా చాటినా మొత్తంగా అమెరికాకు 126 పతకాలు రాగా చైనా 91 పతకాల వద్దే ఆగిపోయింది. టేబుల్ టెన్నిస్, జిమ్నాస్టిక్స్, డైవింగ్, షూటింగ్ వంటి క్రీడాంశాల్లో చైనా దూకుడు చూపించగా అథ్లెటిక్స్, స్విమ్మింగ్, జిమ్నాస్టిక్స్, రెజ్లింగ్‌లో అమెరికా ఆధిక్యంలో నిలిచింది. ఆతిథ్య ఫ్రాన్స్ 53 పతకాలతో ఐదో స్థానంలో నిలిచింది. ఆరు పతకాలు వచ్చినా స్వర్ణం లేకపోవడంతో భారత్ 71వ స్థానంతో ముగించింది.

నెరవేరని భారత 'డబుల్ డిజిట్' కల

ఆరు పతకాలతోనే సంతృప్తి

మళ్లీ 'టాప్' లేపిన అమెరికా, చైనా

పతకాల పట్టిక

	దే	స్వ	ర	కా	మొ
1	యూఎస్ఏ	40	44	42	126
2	చైనా	40	27	24	91
3	జపాన్	20	12	13	45
4	ఆస్ట్రేలియా	18	19	16	53
5	ఫ్రాన్స్	16	26	22	64
6	నెదర్లాండ్స్	15	7	12	34
71	భారత్	0	1	5	6

దే: దేశం, స్వ: స్వర్ణం, ర: రజతం, కా: కాంస్యం మొ: మొత్తం

ఒలింపిక్ పతకం నాసిరకం!



పారిస్: వేలాది మంది క్రీడాకారులు పాల్గొనే ఒలింపిక్స్‌లో పతకం గెలవడం అనేది ప్రతి అథ్లెట్ కల. స్వర్ణం, రజతం, కాంస్యం.. రంగు ఏదైనా ఒలింపిక్ మెడల్ అనేది చాలామందికి 'వన్స్ ఇన్ ఏ లైఫ్‌టైమ్ మూమెంట్' వంటిది. అందుకే క్రీడాకారులు తమ పతకాలను అపురూపంగా చూసుకుంటుంటారు. కానీ పారిస్‌లో విజేతలకు ఇచ్చిన పతకాలు రెండు వారాలు కూడా కాకముందే 'రంగు' మారుతున్నాయి. తాజాగా అమెరికాకు చెందిన స్కేట్‌బోర్డింగ్ ప్లేయర్ న్యజా హోస్టన్ ఇదే విషయాన్ని ఎత్తిచూపాడు. గత నెల 29న అతడు కాంస్య పతకం గెలిచాడు. కానీ వారం రోజులు కూడా తిరగకముందే అది రంగు మారిపోయిందని, క్రీడాకారులకు నాసిరకమైన పతకాలు అందించారని అతడు ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పెట్టిన పోస్ట్ చర్చనీయాంశమైంది. అంతేగాక హోస్టన్ 'నాకు దక్కిన పతకం చూడటానికి అబ్బురపరిచేలా కనిపిస్తోంది. కానీ అది నా శరీరానికి ఉండే చెమటకు తాకడంతో పాటు నా స్నేహితులు దానిని ముట్టుకోవడంతో రంగు వెలిసిపోయింది' అని రాసుకొచ్చాడు. దీంతో ఒలింపిక్స్ నిర్వాహకులు హోస్టన్‌కు మరో పతకం అందించారు. ఒలింపిక్ పతకాలను ఈసారి ప్రతిష్టాత్మక ఈఫిల్ టవర్ నుంచి తీసిన ఉక్కు నుంచి తయారుచేస్తున్నామని నిర్వాహకులు ప్రకటించిన విషయం తెలిసిందే.

మూడో మెడల్ గెలిచిన ఉక్రెయిన్ ఎంపీ

- క్రీడలకు శాశ్వతంగా వీడ్కోలు

పారిస్: గత రెండు ఒలింపిక్స్‌లలో పతకాలు గెలిచిన ఉక్రెయిన్ దిగ్గజ రెజ్లర్, ఆదేశ ఎంపీ అయిన ఝాన్ బెలెన్యుక్ పారిస్‌లోనూ సత్తా చాటాడు. 33 ఏండ్ల ఈ రెజ్లర్ 85 కిలోల గ్రీకో రోమన్ కేటగిరీలో కాంస్యం గెలుచుకుని వరుసగా మూడో ఒలింపిక్స్‌లోనూ పతకాలు గెలిచిన ఆటగాడిగా రికార్డులకెక్కాడు. కాంస్య పోరులో బెలెన్యుక్.. 3-1తో అర్కడియుస్ (పోలండ్)ను ఓడించాడు. రియోలో రజతం, టోక్యోలో స్వర్ణం నెగ్గిన బెలెన్యుక్ పారిస్‌లో కాంస్యం నెగ్గిన తర్వాత మ్యాట్‌పైనే ఉక్రెయిన్ సంప్రదాయ నృత్యాన్ని చేసి తన షూస్‌ను అక్కడే విప్పేసి ఆటకు రిటైర్మెంట్ ప్రకటించాడు. 2019లో పీపుల్ పొలిటికల్ పార్టీ తరపున ఎంపీగా గెలిచిన అతడు ఇకపై తాను ప్రజాసేవలోనే నిమగ్నమవుతానని, ఉక్రెయిన్ భవిష్యత్ కోసం తాను కృషి చేస్తానని అన్నాడు. 'పతకం గెలిచినందుకు సంతోషంగా ఉంది. కానీ ఒక ఉక్రెయిన్ పౌరుడిగా నాకు నా దేశం మనుగడ సాగించడం అత్యంత ప్రాధాన్యాంశం. దురదృష్టవశాత్తూ ఉక్రెయిన్‌లో మా భవిష్యత్ ఏంటో మాకే తెలియడం లేదు' అని భావోద్వేగంగా మాట్లాడాడు. రష్యాతో యుద్ధం నేపథ్యంలో గత రెండేండ్లుగా ఉక్రెయిన్ అతలాకుతలమవుతున్న విషయం విదితమే

డ్రా దిశగా తొలి టెస్టు

ట్రినిడాడ్ (పోర్ట్ ఆఫ్ స్పెయిన్): స్వదేశంలో దక్షిణాఫ్రికాతో రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో భాగంగా క్వీన్స్ పార్క్ ఓవల్ వేదికగా జరుగుతున్న మొదటి టెస్టును డ్రా చేసుకునేందుకు వెస్టిండీస్ శ్రమిస్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో సఫారీలు 357 పరుగులకు ఆలౌట్ కాగా విండీస్ 91.5 ఓవర్లలో 233 పరుగులకే చేతులెత్తేసింది. స్పిన్నర్ కేశవ్ (4/76), పేసర్ రబాడా (3/56) ధాటికి ఆతిథ్య జట్టు బ్యాటర్లు నిలువలేకపోయారు. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 124 పరుగుల ఆధిక్యం దక్కించుకున్న సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌ను 173/3 వద్ద డిక్లేర్ చేసింది. స్టబ్స్ (68) చెలరేగి ఆడాడు. 298 పరుగుల లక్ష్యంతో నాలుగో ఇన్నింగ్స్ ఆరంభించిన విండీస్ వర్షం కారణంగా ఆట నిలిచే సమయానికి 3.3 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 11 పరుగులు చేసింది.

తిండి, నిద్ర కరువు

'ఒలింపిక్ విలేజ్'లో వసతులు లేమి

టెన్నిస్ స్టార్ అలెగ్జాండెర్ జ్వెరెవ్

పారిస్: విశ్వక్రీడల్లో పాల్గొనేందుకు పారిస్‌కు వచ్చిన క్రీడాకారులకు 'ఒలింపిక్ విలేజ్'లో వసతుల లేమి తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందని జర్మన్ స్టార్ టెన్నిస్ ప్లేయర్ అలగ్జాండెర్ జ్వెరెవ్ అన్నాడు. ఓ యూట్యూబ్ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో జ్వెరెవ్ మాట్లాడుతూ.. 'నాకు టోక్యో బాగా నచ్చింది. అక్కడ నేను స్వర్ణం గెలిచాను. కానీ ఈ ఏడాది పారిస్‌లోని ఒలింపిక్ గ్రామంలో క్రీడాకారులు వసతుల లేమితో తీవ్ర ఇబ్బందులుపడ్డారు. మాకు అక్కడ సరైన తిండి, నిద్ర లేవు. పడుకోవడానికి పరిస్థితులు అనుకూలంగా ఉండేవి కాదు. గదుల్లో ఏసీలు లేవు. నాతో పాటు జర్మన్ క్రీడాకారులు అక్కడ చాలా అసౌకర్యంగా గడిపారు' అని అన్నాడు. టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం గెలిచిన జ్వెరెవ్ పారిస్‌లో మాత్రం క్వార్టర్స్‌లోనే నిష్క్రమించాడు. కాగా ఒలింపిక్ గ్రామంలో సదుపాయాలు లేవని ఇదివరకే పలువురు క్రీడాకారులు బహిరంగంగానే అసహనం వ్యక్తం చేశారు. తాజా ఎడిషన్‌లో ఓ స్వర్ణంతో పాటు రెండు పతకాలు గెలిచిన ఇటలీ స్విమ్మర్ థామస్ సెకాన్ ఒలింపిక్ విలేజ్‌లో ఉక్కపోతకు తాళలేక సమీపంలో ఉన్న పార్క్‌లో పడుకున్న ఫోటోలు నెట్టింట వైరల్ అయ్యాయి. భారత క్రీడాకారుల కోసం కేంద్ర క్రీడామంత్రిత్వ శాఖ 40 పోర్టబుల్ ఏసీలను పంపించిన విషయం తెలిసిందే.

వేధింపులపై న్యాయ పోరాటం

పారిస్: తనపై సోషల్ మీడియా వేదికగా వెల్లువెత్తుతున్న వేధింపులపై అల్జీరియా బాక్సర్ ఇమానె ఖెలిఫ్ న్యాయ పోరాటానికి సిద్ధమైంది మహిళల 66 కిలోల విభాగంలో బరిలోకి దిగిన ఖెలిఫ్ స్వర్ణం గెలిచిన విషయం తెలిసిందే. అయితే విశ్వక్రీడల్లో తొలి రౌండ్ నుంచే తనను 'పురుషుడు' అని 'ట్రాన్స్‌జెండర్' అంటూ సోషల్ మీడియాలో వేధించడంపై ఆమె పారిస్‌లోని న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ఈ సందర్భంగా ఖెలిఫ్ స్పందిస్తూ.. 'ఒలింపిక్స్ సందర్భంగా నాపై వచ్చిన వార్తలు అనైతికమైనవి. వాటిని న్యాయపోరాటంతో ఎదుర్కోవాలని భావిస్తున్నా. నాపై వేధింపులకు పాల్పడ్డవారి ఆలోచనలు మార్చాలనుకుంటున్నా' అని తెలిపింది.

విజయం స్ఫూర్తితో సాగాలి

బ్యాడ్మింటన్ ద్వయం జాలి, గాయత్రి

హైదరాబాద్ ఆట ప్రతినిధి: క్రీడాకారులంతా విజయం స్ఫూర్తితో ముందుకు సాగాలని భారత టెన్నిస్ ద్వయం పుల్లెల గాయత్రి, ట్రీసా జాలి అన్నారు. నగరంలోని గోపీచంద్ అకాడమీ వేదికగా జరిగిన యూనిక్స్ సన్‌రైస్ పదవ తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్ అండర్-13 చాంపియన్‌షిప్ ముగింపు వేడుకల్లో పాల్గొన్న గాయత్రి, జాలి విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ టోర్నీ బాలికల సింగిల్స్ విజేతగా హంసిని, డబుల్స్‌లో హంసిని-ప్రయంవద విజేతలుగా నిలవగా బాలుర విభాగంలో క్రిశవ్, డబుల్స్‌లో చిన్మయ్-క్రిశవ్ టైటిల్ నెగ్గారు. ఈ కార్యక్రమంలో ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ చాముండేశ్వరి నాథ్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్ జనరల్ సెక్రటరీ వంశీధర్, తదితరులు హాజరయ్యారు.

ఆ ఫోన్‌కాల్‌తో ఎమోషనల్ అయ్యాను

'మీ ఊరు రాకుండా మిమ్మల్ని కలవకుండా మా సినిమాలు రిలీజ్ కావు. ఈ సినిమా గురించి మాట్లాడాలంటే రామ్ ఎనర్జీ గురించే మాట్లాడాలి. రామ్ సెట్‌లో అడుగుపెట్టగానే ఏదో శక్తి వస్తుంది. అద్భుతమైన డ్యాన్స్, తెలంగాణ యాసతో తన పాత్రను రక్తికట్టించాడు. రామ్ లేకపోతే ఈ సినిమా లేదు' అన్నారు పూరి జగన్నాథ్. ఆయన దర్శకత్వంలో రామ్ కథానాయకుడిగా నటించిన 'డబుల్ ఇస్మార్ట్' ఈ నెల 15న ప్రేక్షకుల ముందుకురానుంది. పూరి కనెక్ట్స్ పతాకంపై పూరి జగన్నాథ్, ఛార్మికౌర్ నిర్మించారు. ఆదివారం హన్మకొండలో ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా పూరి జగన్నాథ్ మాట్లాడుతూ ' హీరో రామ్ 'ఇస్మార్ట్‌శంకర్' కంటే డబుల్‌ఎనర్జీతో ఈ సినిమా చేశారు. నా సినిమా ఒకటి ఫ్లాప్ అయినప్పుడు రచయిత విజయేంద్రప్రసాద్‌గారు ఫోన్ చేసి 'సర్ నాకు చిన్న హెల్ప్ చేస్తారా' అనడిగారు. ఆయన కొడుకే పెద్ద డైరెక్టర్.. నేను చేసే హెల్ప్ ఏముంటుందని అనుకున్నా. 'మీరు నెక్ట్స్ సినిమా చేసే ముందు కథ చెబుతారా? ఏమైనా చిన్న మార్పులుంటే సూచిస్తాను. ఎందుకంటే మీలాంటి డైరెక్టర్స్ ఫెయిల్యూర్ అయితే నేను చూడలేను' అన్నారు. ఆ రోజు నేను చాలా ఎమోషనల్‌గా ఫీలయ్యా. అందుకే ఒళ్లు దగ్గర పెట్టుకొని ఈ సినిమా చేశా. మా టీమ్ అందరికి ఓ బ్లాక్‌బస్టర్ అవసరం. ఈ సినిమాతో అది దక్కుతుందని ఆశిస్తున్నా' అన్నారు. హీరో రామ్ మాట్లాడుతూ 'ఐదేళ్ల తర్వాత మళ్లీ వరంగల్‌కు వచ్చాను. ఇప్పటికీ కూడా తెలుగు ఇండస్ట్రీలో పూరి జగన్నాథ్ మోస్ట్ ఇన్‌స్పైరింగ్ డైరెక్టర్. కొత్త దర్శకులు ఆయన స్ఫూర్తితో ఇండస్ట్రీలోకి వస్తుంటారు. నా ఫోన్ కాంటాక్ట్‌లో పూరిగారి పేరును 'గన్' అని పెట్టుకున్నా. ఎందుకంటే హీరోలు బుల్లెట్ల లాంటివారు. పేల్చే గన్ కరెక్ట్‌గా ఉంటే బుల్లెట్ పర్‌ఫెక్ట్‌గా వెళుతుంది. పూరి లాంటి గన్ ప్రతి యాక్టర్‌కి అవసరం. ఇక ఏ విషయమైనా ముందు మనకు నచ్చిందో లేదో తెలుసుకోవాలి. అది సినిమా అయినా బిర్యానీ అయినా పక్కోడి ఒపీనియన్ గురించి పట్టించుకోవద్దు. నేను జనరల్‌గా సలహాలు ఇవ్వను. కానీ మీరంతా నా మనుషులే అని భావించి ఇచ్చాను' అన్నారు. 'డబుల్ ఇస్మార్ట్' పాటలు, ప్రచార చిత్రాలకు అద్భుతమైన స్పందన లభించిందని, సినిమా విజయంపై పూర్తి నమ్మకంతో ఉన్నామని ఛార్మి తెలిపింది.

అక్టోబర్ నుంచి యాక్షన్ మొదలు


చిత్రం

పవన్‌కల్యాణ్ మళ్లీ సినిమాల్లో బిజీ కానున్నారు. అక్టోబర్ నుంచి 'ఓజీ' చిత్రం కోసం ఆయన డేట్లు ఇచ్చారని తెలుస్తున్నది. ఇటీవలే పవన్‌కల్యాణ్‌ని చిత్ర నిర్మాత డీవీవీ దానయ్యను కలిశారని, ఈ సందర్భంగా 'ఓజీ' పూర్తి చేసేందుకు పవన్ సుముఖత వ్యక్తం చేశారని విశ్వసనీయ సమాచారం. సుజిత్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా షూటింగ్ దాదాపు చివరి దశలో ఉంది. ఇదిలావుంటే.. పవన్ నటించిన తొలి జానపద చిత్రం 'హరిహర వీరమల్లు' కూడా సగం పైనే షూటింగ్ పూర్తి చేసుకుంది. దీంతో ఈ సినిమాను కూడా 'ఓజీ'తో పాటే పూర్తి చేసేయాలనే సంకల్పంతో పవన్ ఉన్నట్టు తెలుస్తుంది. మరి 'ఓజీ'తో పాటు పూర్తి చేస్తారా? లేక 'ఓజీ' పూర్తయ్యాక వీరమల్లు మొదలుపెడతారా? అనేది తెలియాల్సివుంది. ఏదేమైనా.. ముందు ఈ రెంటింటినీ పూర్తి చేసి, వచ్చే ఏడాది 'ఉస్తాద్ భగత్‌సింగ్' మొదలుపెడతారట పవన్‌కల్యాణ్. పవర్‌స్టార్ ఇచ్చే డేట్స్‌ని బట్టి, తన తదుపరి చిత్రాలను ప్లాన్ చేసుకుంటున్నారట దర్శకుడు హరీశ్‌శంకర్.

రవితేజ 'కోహినూర్'?

హీరో రవితేజ వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ఆయన నటించిన తాజా చిత్రం 'మిస్టర్ బచ్చన్' ఈ నెల 15న విడుదలకానుంది. ఇదిలావుండగా రవితేజ 75వ సినిమా టైటిల్ గురించి ఆసక్తికరమైన వార్తలు వినిపిస్తున్నాయి. భాను భోగవరపు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ నిర్మిస్తున్నది. ఏప్రిల్‌లో ఈ సినిమా ప్రకటన వెలువడింది. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతున్నది. తెలంగాణ నేపథ్యంలో తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో రవితేజ పాత్ర పేరు లక్ష్మణభేరి. ఈ చిత్రానికి 'కోహినూర్' అనే టైటిల్ పరిశీలనలో ఉందని సమాచారం. అయితే ఈ విషయంలో అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. కమర్షియల్ మాస్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిస్తున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల చేయబోతున్నారు.

ట్రైలర్‌కు ముహూర్తం ఖరారు

నాని కథానాయకుడిగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'సరిపోదా శనివారం'. వివేక్ ఆత్రేయ దర్శకుడు. డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మిస్తున్నారు. ఈ నెల 29న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమా ట్రైలర్‌ను ఈ నెల 13న విడుదల చేయబోతున్నారు. 'యాక్షన్ అడ్వెంచర్ మూవీ ఇది. నాని పాత్ర కొత్త పంథాలో ఉంటుంది. శనివారం మాత్రమే ప్రత్యర్థుల పనిపట్టే సూర్య అనే యువకుడిగా ఆయన పాత్ర భిన్న పార్శ్వాల్లో సాగుతుంది. యాక్షన్ ఘట్టాలు రోమాంచితంగా ఉంటాయి. ఇప్పటికే రిలీజైన టీజర్, ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభిస్తున్నది. నాని కెరీర్‌లో ఓ వైవిధ్యమైన చిత్రంగా నిలిచిపోతుంది' అని మేకర్స్ తెలిపారు. ప్రియాంక అరుళ్ మోహన్, ఎస్.జే.సూర్య తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: మురళి.జి, సంగీతం: జేక్స్ బిజోయ్, రచన-దర్శకత్వం: వివేక్ ఆత్రేయ.

ట్రోల్స్ రానందుకు సంతోషం

అగ్ర కథానాయిక జాన్వీకపూర్ సోషల్‌మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటుంది. తన సినిమా విశేషాలను ఎప్పటికప్పుడు అభిమానులతో పంచుకుంటుంది. ఎన్టీఆర్ 'దేవర' చిత్రంతో ఈ భామ తెలుగులో అరంగేట్రం చేస్తున్న విషయం తెలిసిందే. ఇటీవలే ఈ సినిమా నుంచి 'చుట్టమల్లే..' అనే ప్రేమగీతాన్ని విడుదల చేశారు. ఈ పాట సోషల్‌మీడియలో ట్రెండింగ్‌లో ఉంది. జాన్వీకపూర్ అందచందాలు, ఎన్టీఆర్ నృత్యాలు అభిమానులను అలరిస్తున్నాయి. ఈ పాట గురించి తాజా ఇంటర్వ్యూలో మాట్లాడింది జాన్వీకపూర్. సాధారణంగా ఏదైనా పాట రిలీజైనప్పుడు అందులోని లోపాలను చూపిస్తూ ట్రోల్స్ చేస్తుంటారని, అయితే 'చుట్టమల్లే' పాటకు ఎలాంటి ట్రోల్స్ రాకపోవడం చాలా ఆనందంగా ఉందని జాన్వీకపూర్ చెప్పింది. ఈ పాటకు సంబంధించి అభిమానులు చేస్తున్న రీల్స్‌ను తన సోషల్ మీడియా ఖాతాల్లో ప్రతిరోజు షేర్ చేస్తున్నది జాన్వీకపూర్. 'దేవర' చిత్రం సెప్టెంబర్ 27న ప్రేక్షకుల ముందుకురానుంది.

ప్రేమ ప్రయాణంలో..

స్వీయ దర్శకత్వంలో చిమటా రమేష్‌బాబు హీరోగా నటిస్తున్న చిత్రం 'నేను-కీర్తన'. లక్ష్మీ కుమారి నిర్మాత. రిషిత, మేఘన కథానాయికలుగా నటిస్తున్నారు. ఈ నెల 30న విడుదలకానుంది. ఇటీవల ట్రైలర్, ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో, దర్శకుడు చిమటా రమేష్‌బాబు మాట్లాడుతూ 'మల్టీజోనర్ ఫిల్మ్‌గా తెరకెక్కించాం. అందమైన ప్రేమకథతో పాటు అన్ని కమర్షియల్ అంశాలుంటాయి. తప్పకుండా తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంటుందనే నమ్మకం ఉంది' అన్నారు. సంధ్య, రేణుప్రియ, జీవా తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: కె.రమణ, సంగీతం: ఎం.ఎల్.రాజా, సమర్పణ: చిమటా జ్యోతిర్మయి, రచన-దర్శకత్వం: రమేష్‌బాబు.



సామాన్యుడి అసాధారణ ప్రయాణం

వరుణ్‌తేజ్ కథానాయకుడిగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'మట్కా'. కరుణ కుమార్ దర్శకుడు. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఆదివారం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో హీరో వరుణ్ తేజ్ యంగ్‌స్టర్, మిడిల్ ఏజ్డ్ మ్యాన్‌గా రెండు విభిన్నమైన లుక్స్‌తో స్టైలిష్‌గా కనిపిస్తున్నారు. ఓ సాధారణ యువకుడు అసాధారణ శక్తిగా ఎదిగిన వైనాన్ని ఆవిష్కరించేలా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను తీర్చిదిద్దారు. 'పీరియాడిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నాం. భిన్న కాలవ్యవధుల్లో నడిచే ఈ కథలో వరుణ్‌తేజ్ నాలుగు గెటప్స్‌లో కనిపిస్తారు. దేశం మొత్తం సంచలనం సృష్టించిన యథార్థ సంఘటనల స్ఫూర్తితో ఈ సినిమాను తెరకెక్కించాం' అని చిత్రబృందం పేర్కొంది. నోరా ఫతేహి, మీనాక్షి చౌదరి, నవీన్‌చంద్ర, అజయ్‌ఘోష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఏ.కిషోర్ కుమార్, సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్, నిర్మాతలు: విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: కరుణ కుమార్.

రహస్యాల 'వీక్షణం'

రామ్ కార్తీక్, కశ్వి జంటగా నటిస్తున్న చిత్రం 'వీక్షణం'. మనోజ్ పల్లేటి దర్శకుడు. పద్మనాభ సినీ ఆర్ట్స్ పతాకంపై పి.పద్మనాభ రెడ్డి నిర్మిస్తున్నారు. ఆదివారం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. 'సస్పెన్స్, మిస్టరీ, థ్రిల్లింగ్ అంశాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. ఓ రహస్య ఛేదనలో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకున్నాయనేది ఆసక్తికరంగా సాగుతుంది. సాంకేతికంగా ఉన్నతంగా ఉంటుంది. చిత్రీకరణ పూర్తయింది. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలో తెలియజేస్తాం' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: సమర్థ్ గొల్లపూడి, దర్శకత్వం: మనోజ్ పల్లేటి.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No